# అమ్మలాంటి అత్త

-గన్నవరపు నరసింహమూర్తి

'పోస్ట్' అంటూ పోస్ట్‌మాన్ ఒక కవరిచ్చి వెళ్లిపోయాడు. మాధవి ఆ కవరుని అందుకొని అది ఎక్కడినుంచి వచ్చిందో చూసింది. అది ఆమె తల్లి సావిత్రి రాసిన ఉత్తరం.

ప్రియమైన మధుకి,

మీ అమ్మ ఆశీర్వదించి వ్రాయునది. మీ నాన్నగారు చనిపోయి అప్పుడే రెండు నెలలవుతోంది. ఆయన చనిపోయిన పదమూడో రోజు వెళ్లిపోయిన మీ అన్నయ్యాలు యిప్పటిదాకా రాలేదు. ఈరోజు ఆయన రెండో మాసికం. అక్కడ వాళ్లు దాన్ని పెడుతున్నారో లేదో తెలియదు. యికపోతే యిక్కడ నేను ఒంటరిగా చాలా బాధపడుతున్నాను. నా ఆరోగ్యం సరిగ్గా లేదు. పైగా ఖర్చులకు నా దగ్గర డబ్బులు కూడా లేవు. ఊరెళ్లిన తరవాత పంపిస్తామన్న మీ అన్నలు యిప్పటిదాకా పంపలేదు.

వారం రోజులుక్రితం మందులకు అవసరమై పక్కింటి సీత పిన్ని దగ్గర రెండొందలు అప్పు తీసుకున్నాను. మీ అన్నలకు ఉత్తరం రాసినా సమాధానం లేదు. అందుకే నీకు ఈ ఉత్తరం రాస్తున్నాను. మీ నాన్న చనిపోయిన తరువాత మీరందరూ నన్ను ఒంటరిగా వదిలివేయడం నన్ను కలచి వేస్తోంది. మీ అన్నలకైతే మొదటి నుంచీ లేదు. కనీసం నువ్వైనా కన్నతల్లిని ఆదరిస్తావని ఆశిస్తున్నాను. ఈ సమస్యలతో అనారోగ్యంతో యిక్కడ నేను ఒంటరిగా మరి ఉండలేను. కాబట్టి ఈ ఉత్తరం అందిన వెంటనే నువ్వు అల్లుడు కలిసి వచ్చి నన్ను మీ ఊరు తీసుకెళ్లవలసిందిగా కోరుచున్నాను. అర్థం చేసుకుంటావని ఆశిస్తూ..

మీ అమ్మ
సావిత్రి

ఉత్తరం ఆసాంతం చదివిన మాధవికి కళ్ల నీళ్లు తిరిగాయి. ఏం చెయ్యాలో ఆమెకు తోచటంలేదు. నాన్నగారు చనిపోయిన తరువాత అమ్మని ఎలాగైనా తనింటికి తీసుకురావడానికి ఆమె విశ్వ ప్రయత్నం చేసింది. కానీ ఆమెకు భర్త వేణుకు ఆ విషయమై చాలాసార్లు జరిగిన ఘర్షణ దానికడ్డువచ్చింది. అప్పట్నుంచీ మాధవి మానసికంగా కృంగిపోసాగింది. ఏమీ చెయ్యలేని నిస్సహాయత. భర్తని ఒప్పించలేని బలహీనత...ముఖ్యంగా తన అత్తగారితో ఆమె ప్రవర్తించిన తీరు దీనికి కారణం!?

ఆమెకు జరిగిన గతం గుర్తుకురాసాగింది.

★★★

రాజారావు, సావిత్రమ్మ దంపతులకు ముగ్గురు పిల్లలు. యిద్దరు కొడుకులకు నాలుగేళ్ల క్రితం పెళ్లైతే, కూతురు మాధవికి పెళ్లై మూడేళ్లయింది. మాధవిని జిల్లా పరిషత్ స్కూల్లో సైన్స్ టీచరుగా పనిచేస్తున్న వేణుకిచ్చి పెళ్లి చేశారు. వేణు నాన్నగారు చిన్నప్పుడే చనిపోవడంతో వాళ్లమ్మ రాజేశ్వరి అన్నీ తానే అయి పెంచి పెద్ద చేసింది. వేణుకు టీచరుగా ఉద్యోగం వచ్చిన తరుత సాంప్రదాయ కుటుంబమనీ తెలిసిన రాజారావు కూతురు మాధవితో పెళ్లి జరిపించిందామె. కానీ పెళ్లైన ఆర్నెల్లకే మాధవి వేణుని పోరుపెట్టి ఆ ఊరునించి దూరంగా బదిలీ చేయించింది. ఈ ఊరునించి బదిలీ అయితే అత్తగారు తమతో రాదని మాధవి ఆలోచన. కానీ ఒక్కగానొక్క కొడుకు వేణుని వదలడం యిష్టంలేక వాళ్లతోపాటు తానుకూడా ఆ ఊరికి బయలుదేరింది. కానీ వెళ్లిన వారం రోజుల తరువాత మాధవి నిజ స్వరూపం బయటపడింది. చీటికి మాటికీ అత్తగారితో గొడవలు పెట్టుకునేది.

రాజేశ్వరికి తెల్లవారగానే మడిగా పూజ చేసుకోవడం అలవాటు. కానీ దానివల్ల తమకు నిద్రాభంగం అవుతోందని మాధవి అత్తగారితో తగువు పెట్టుకుంది. దానివల్ల మాటామాట పెరిగి మాధవి అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. తనవల్ల కొడుకు కోడలుకి మధ్య గొడవలు రావడం యిష్టంలేక రాజేశ్వరి స్వంత ఊరు వెళ్లిపోయింది. అయితే రాజేశ్వరికి ఆర్థికపరమైన యిబ్బందులేం లేవు. భర్త ఉద్యోగంవల్ల వచ్చే ఫించను దానికి తోడు వారసత్వపు ఆస్థి పదెకరాల పొలం ఆమె పేరిట ఉంది. పెద్ద ఇల్లు. కాకపోతే ఈ వృద్ధాప్యంలో ఒక్కగానొక్క కొడుకు దగ్గర మనవలతో కాలం గడిపెయ్యాలన్న కోరిక తీరనందుకు ఆమెకు బాధగా వుంది.

రాజేశ్వరి యింటినుంచి వెళ్లిపోయిన తరువాత మాధవి వేణు దగ్గరకొచ్చేసింది. అప్పట్నించి వేణుకు మాధవికి గొడవలు మొదలయ్యాయి. తన తల్లిని కావాలనే బాధలుపెట్టి యింటినుంచి పంపించేసిందని మాధవిపై వేణుకి అంతర్గతంగా చాలా కోపంగా ఉంది. చిన్నప్పట్నించి తండ్రి లేకపోయినా తనను ప్రాణంగా పెంచి పెద్ద చేసిన తల్లి అంటే వేణుకి ప్రాణం. యింతలో మాధవి తండ్రి రాజారావ్ ఆకస్మికంగా చనిపోవడంతో సావిత్రమ్మ ఒంటరి దయింది. రాజారావ్‌గారు పెద్దగా ఆస్తులేవీ మిగల్చకపోవడంతో సావిత్రమ్మ బ్రతుకు దుర్భరమై పిల్లలమీదే ఆధారపడక తప్పింది కాదు.

కొడుకుల నిరాదరణకు గురైన తల్లిని తనింటికి తీసుకువస్తానని మాధవి చెప్పినప్పుడు వేణు అభ్యంతరం చెప్పాడు. తన తల్లిని ఆమె యింటి నుంచీ పంపించివేసిందనీ అందుకనీ ఆమె తల్లి కూడా యిక్కడ ఉండరాదనీ అతను తెగేసి చెప్పడంతో మాధవికి ఏం చెయ్యాలో పాలుపోలేదు. ఒకపక్క తల్లి పడుతున్న బాధలు, ఇంకోప్రక్క ఏమీ చెయ్యలేని నిస్సహాయస్థితి...అటువంటి సమయంలో తల్లినుంచి వచ్చిన ఈ ఉత్తరం ఆమెలో మరింత అలజడి రేపింది.

★★★

ఉత్తరం పూర్తిగా చదివిన తరువాత మాధవిలో నైరాశ్యం చోటు చేసుకుంది. దీనికంతటికీ తన ప్రవర్తనే కారణం. తను తన అత్తగారితో సరిగ్గా ప్రవర్తిస్తే ఈ బాధలుండేవి కావు. చక్కగా తన తల్లి, అత్తగారు ఒకరికొకరు తోడుగా వుండేవారు...ఈ ఆలోచన రాగానే ఆమెకు కళ్లనీళ్లు తిరిగాయి. అప్పటికి రెండు రోజులక్రితం వేణు ఆఫీసు పనిమీద విశాఖపట్నం వెళ్లాడు.

ఆరోజు తనతో గొడవపడి వెళ్లినవాడు యిప్పటిదాకా యింటికి ఫోన్ కూడా చెయ్యలేదు... ఆ ఆలోచనతో ఆమె మస్తిష్కం వేడెక్కిపోయింది. ఎలాగైనా వేణుని ఒప్పించి అమ్మని తీసుకురావాలి, కానీ వేణు అందుకుససేమిరా ఒప్పుకోడు?... అందుకే కొన్నాళ్లు అమ్మని అక్కడే ఉండమనీ, వీలుచూసుకొని తను యిక్కడకు తీసుకొస్తానని ఉత్తరం రాద్దామని నిర్ణయించుకొని పెన్నుకోసం వేణు జేబులో చేయిపెట్టిన ఆమెకు ఒక ఇన్‌లాండ్ లెటర్ కనిపించడంతో ఆశ్చర్యపోతూ దాన్ని విప్పి చూసింది. అది తన అత్తగారు వేణుకి రాసిన ఉత్తరం. దానిమీద తమ




ఇంటి అడ్రస్ కాకుండా అతని స్కూలు అడ్రస్ రాసి వుంది. అంటే ఆ ఉత్తరం తను చదవకూడదని రాసిన ఉత్తరంలా ఉంది. అందులో ఇలా వుంది....

**ప్రియమైన వేణుకి,**

మీ అమ్మ ఆశీర్వదించి వ్రాయునది. అక్కడ నువ్వు కోడలు మాధవి కూడా కులాసాగా ఉన్నారని తలుస్తాను. ఇక అసలు విషయానికొస్తే ఈ మధ్యనే మీ మామగారు చనిపోవడంతో మీ అత్తగార్ని పరామర్శించడానికి వాళ్ల ఊరు వెళ్లాను. ఆమె అక్కడ ఒంటిరిగా చాలా దుర్భర పరిస్థితుల్లో ఉంది. మీ బావమరుదులిద్దరూ మీ మామగారి కర్మకాండలు పూర్తైన తరువాత వెళ్లిపోయిన వారు మరలా తిరిగిరాలేదుట. ఆమె పోషణకు డబ్బులు కూడా పంపటం లేదుట. ఆఖరికి మీరందరూ ఉండికూడా ఆమెని అలా ఒంటరిగా వదిలివేయడం నాకు చాలా బాధనిపించింది. కూతురింటికి వెళ్లకపోయూరా అని నేనడిగితే నువ్వు ఒప్పుకోవటంలేదని నీ భార్య చెప్పిందిట. అందుకే నేను ఈరోజు ఈ ఉత్తరం రాస్తున్నాను. నన్ను నీ భార్య సరిగ్గా చూడలేదన్న కోపంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న నీ అత్తగార్ని తీసుకురావద్దనడం చాలా తప్పురా వేణూ! ప్రతీవారికీ జీవితంలో యిటువంటి కష్టాలు వస్తుంటాయ్. ఆమె మీ అత్తగారనీకాదు, అవసానదశలో ఉన్న ఒక వృద్ధురాలు! ఆమె కూడా నీ మాతృసమానురాలే, అల్లుడు కూడా కొడుకు సమానుడే! తల్లితండ్రులు కష్టాలలో ఉన్నప్పుడు ఆదుకోవలసిన ధర్మం కొడుకులకేకాదు, కూతుళ్లకూ ఉంది.. ఆ ధర్మాన్ని మీ అత్తగార్ని మీ యింటికి తీసుకురావడం ద్వారా నీవు నిర్వర్తించు. అది నిన్ను కాపాడుతుంది.

వేణూ! మాధవి జీవితంలో ఆటుపోట్లు తెలియని వ్యక్తి. అదీగాక నేను మీదగ్గర లేకపోయినా నేను మన ఊళ్లో హాయిగా బ్రతగ్గలను. నాకంటూ మీ నాన్నగారిచ్చిన యిల్లు, పొలం ఉన్నాయి. కానీ అవేమీ లేని మీ అత్తగారికి పిల్లల అండ కావాలి. ఇప్పుడు ఆమెను నువ్వే ఆదుకోవాలి.కాబట్టి యిటువంటి పరిస్థితుల్లో ఆమెను ఆదుకోవడం మానవధర్మం. నీకు నామీద వీసమెత్తు గౌరవమున్నా వెంటనే వెళ్లి ఆమెను మీ యింటికి తీసుకెళ్లు- ఆ పని వెంటనే చేస్తావని ఆశిస్తూ...

**మీ అమ్మ**
**రాజేశ్వరం**

ఉత్తరాన్ని చదివిన మాధవికి కంటనీరు ధారాపాతంగా కారసాగింది. తన అత్తగారిది నిజంగా అమృతహృదయం. తను ఆమె విషయంలో చాలా తప్పుగా ప్రవర్తించింది. అలా ఆలోచిస్తూ సోఫాలో కూర్చుండిపోయింది. అలా ఎంతసేపు కూర్చుందే తెలియదు కానీ ఇంతలో తలుపు చప్పుడవడంతో ఈలోకంలోకొచ్చి తలుపు తీసింది. ఎదురుగా భర్త వేణు, వెనుకనే తన తల్లి నిలబడివున్నారు. తనని క్షమించమని భర్తని అడిగేవరకూ ఆమె మనసు శాంతించలేదు.

★